దేవత

జె. సుబ్బలక్ష్మి

ఆ రోజు నర్సు ప్రమీలది నైట్‌డ్యూటీ

'అప్పుడు సమయం పదకొండు గంటలు వార్డంతా మరోసారి కలయతిరిగి వచ్చి తన సీట్లో కూర్చుంది ప్రమీల రోగులందరూ మంచి నిద్రలో ఉన్నారని నిశ్శబ్దంగా, ప్రశాంతంగా వున్న వార్డు చెప్పకచెబుతోంది రాత్రిళ్ళు ఉండి ఉండి వినిపించే పసిపిల్లల ఏడుపులు కూడా వినిపించడం లేదు

కుర్చీలో కూర్చునే ప్రమీల వరసగా వున్న మంచాల వైపు చూపులు సారించింది రకరకాల భంగిమల్లో నిద్ర పోతున్న రోగుల మొహాలలో సంతృప్తి, సంతోషం కొట్టొచ్చినట్టు కనిపిస్తున్నాయి తమ పసిపాపలను ప్రేమగా, లాలనగా గుండెల కదుముకుని పడుకున్న ఆ 'రోగుల్లో' అదో విధమైన గర్వం కూడా తొంగి చూస్తోంది ప్రమీల కెందుకో నవ్వొచ్చి పక్కున నవ్వింది వివిధరకాల జబ్బులతో బాధపడుతూ, రోగాలతో ముక్కుతూ, మూల్గుతూ ఆస్పత్రికి చేరేవాళ్లని రోగులు' అని పిలిచినా బావ్యంగా వుంటుంది కాని ఇంట్లో ఇంచక్కా కావలసినవన్ని చేయించుకు తింటూ, హాయిగా తిరుగుతూ నెలలు నిండగానే అప్తులతో, ఆత్మీయులతో కలిసివచ్చి ఆస్పత్రిలో చేరి అందరి ముద్దు మురిపాలనందుకునే పసిబిడ్డలకు జన్మనిచ్చి తమ జన్మ తరించినట్టు అనుభూతి చెందుతూ హాయిగా, సుఖంగా కాలక్షేపం చేసే ఈ తల్లులను రోగులు అనడం ఏం బావ్యం ' తమను ఎంతగానో ప్రేమించే తల్లితండ్రులకూ, భర్తలకూ, బంధువులకూ ఇబ్బంది కలిగించడం ఇష్టంలేక డాక్టర్లు, నర్సులు, ఆయాలచేత సేవలు అందుకోడానికి ఇక్కడికి వస్తారు అంతే ఆ తరువాత తమ దాంపత్య ఫలాన్ని చేతుల్లో నిండుగా ఎత్తుకుని గర్వంతో విర్రవీగుతూ ఇంటికి చేరుకున్నారంటే ఇక అంతే ఆ తరువాత ఆస్పత్రినీ, ఇక్కడి సిబ్బందినీ, తాము అందుకున్న సేవలనీ ఇట్టే మరిచిపోతారు

ఇలా ఆలోచిస్తూ కూర్చున్న ప్రమీలకు ఒకదాని వెంట ఒకటిగా ఆవలింతలు రావడం మొదలుపెట్టాయి కనురెప్పలు బరువెక్కి నెమ్మదిగా మూసుకుపోసాగాయి కాసేపు బలవంతాన కళ్ళు తెరుచుకుని కూర్చుందిగానీ ఆ తరువాత ఇక నిద్ర నాపుకోవడం కష్టమనిపించి ముందున్న బల్ల మీద ఒరిగిపోయింది

కాస్త కునుకు పట్టిందో లేదో – ఈలోగా భుజంపై ఎవరిదో చెయ్యి పడేసరికి ఉలిక్కిపడి కళ్ళు తెరిచింది ప్రమీల ఎదురుగా డాక్టర్ వసుంధరాదేవి నిలబడి వుంది

ప్రమీల చటుక్కున లేచి నిలబడి ఎస్ డాక్టర్ అంది

రౌండ్సు పూర్తయ్యాయా సిస్టర్? డాక్టరు వసుంధరాదేవి ప్రశ్నించింది

అయ్యాయి డాక్టర్ సమాధానమిచ్చింది ప్రమీల

ఆ చివరి బెడ్ అమ్మాయి ఏమంటోంది?

ఇప్పుడు బాగానే వుంది డాక్టర్

'కాస్త జాగ్రత్తగా కనిపెడుతూ వుండండి ఆమెని '

అలాగే డాక్టర్

డాక్టర్ వసుంధరాదేవి వెళ్లిపోయింది వార్డు ప్రక్కనే డ్యూటీ రూమ్ 'ఈవిడ ఇప్పుడు ఈ డ్యూటిరూమ్‌లో హాయిగా పడుకుని నిద్రపోతుంది కాబోలు తనలాంటి నర్సులు మాత్రం రాత్రంతా మేల్కొని వుండి రోగులను కనిపెడుతూ, అవసరమైనప్పుడు వాళ్ళకు సేవలు చేయాలి ఇంకా అవసరమైతే పరుగెత్తుకెళ్ళి డ్యూటీలో వున్న డాక్టరును నిద్రలేపి తీసుకురావాలి ఇక 'బికేర్‌ఫుల్ జాగ్రత్త!' లాంటి మాటలు రోజుకు ఎన్నిసార్లు వినాలో? అయినా తన డ్యూటీలో ఎలాంటి లోపం జరగకపోయినా ఈ మాటలు వినడం మాత్రం తప్పదు

– డ్యూటిలో వున్న నర్సులు మందుసీసాల లేబుల్స్ చూడకుండా అది ఏ పేషెంట్‌కివ్వాలో గమనించకుండా తీసుకెళ్ళి ఎవరి నోట్లోనో పోసేస్తారేమోననీ, ఒకరికివ్వాల్సిన ఇంజెక్షన్ మరొకరికి ఇచ్చేస్తారేమోననీ ఈ డాక్టర్లు అనుకుంటారు కాబోలు తమ గురించి? –

ఆస్పత్రుల్లో పసి బిడ్డలకు స్నానం చేయించడానికి తీసుకెళ్లినప్పుడు వారు మారిపోతూ వుండడం, వార్డుల్లోకి కుక్కలు వచ్చి పసిబిడ్డల నెత్తుకుపోవడం వంటి వింత వార్తలన్నీ పత్రికల్లో చదివి – తమ ఆస్పత్రిలో కూడా అలాంటిదేదైనా జరుగుతుందేమోనని భయం కాబోలు? అయినా మరీ అంత నిర్లక్ష్యంగా ఎవరుంటారబ్బా ?

– అంతకు ముందున్న నిద్రమత్తంతా ఎగిరిపోగా మళ్ళీ ఆలోచనల సుడిలో కూరుకుపోయింది ప్రమీల

అంతలో ఒక నీరసమైన ఎలుపు వినిపించింది – సిస్టర్ అని

ప్రమీల వరసగా వున్న మంచాలకేసి దృష్టి మళ్లించింది కాని ఆ పిలుపు ఏమంచం నుంచి వచ్చిందో తెలియలేదు , ఎవరి పిలుపయి వుంటుంది ? అని అనుకుంటూ వుండగానే చివరి బెడ్ మీదున్న పేషెంట్ ఈసారి చెయ్యెత్తి సిస్టర్ అని పిలవడం వినిపించింది

ప్రమీల చటుక్కున లేచి ఆమె దగ్గరికి నడిచింది ఏమ్మా ఏం కావాలి? అని అడిగింది మృదువుగా

కాసేపు ఇక్కడే కూర్చోండి సిస్టర్ నాకేమిటో చాలా బాధగా వుంది

ఇప్పుడు అలాగే వుంటుందమ్మా నెమ్మదిగా అదే సర్దుకుంటుందిలే' అనునయిస్తూ అంది ప్రమీల

అసలు నన్ను నామానాన చావనీయకుండా ఇక్కడికి తీసుకొచ్చి ఎందుకు బతికించారు సిస్టర్?

ఇప్పుడెందుకమ్మా అవన్నీ? జరిగిందంతా మరిచిపోయి హాయిగా నిద్రపో!

అదికాదు సిస్టర్ అసలు నాలాంటి నిర్భాగ్యురాలు లేకపోతే ఈప్రపంచానికొచ్చిన నష్టమేమిటి?నేను బతికుంటే సమస్యలు, కష్టాలు అంతకంతకూ అధికమవుతాయి చచ్చిపోతే ఏ సమస్యా ఉండదని ఆత్మహత్యకు పాల్పడ్డాను కానీ మీరు నన్ను రక్షించాననుకుని మళ్ళీ సమస్యల సుడిగుండంలోకి తోశారు

పిచ్చిదానా మానవ జీవితాలే సమస్యల పుట్ట ఎదురైన కష్టాలను ధైర్యంతో ఎదుర్కోవాలి తప్ప బలవంతాన ప్రాణాలు తీసుకోవడం పిరికితనం '

ఆమె పెద్దగా నిట్టూర్చి 'పిరికితనం అని నాకూ తెలుసు కానీ బతకడానికి ఇంకే మార్గమూ లేనప్పుడు అంతకంటే చేసేదేముంది –చెప్పండి సిస్టర్? అంది అప్పటికే ఆమె గొంతు దుఃఖంతో పూడుకుపోయింది

మనసుంటే మార్గం కనిపించకపోదమ్మా రేపు నీకు పుట్టబోయే బిడ్డే నీకు మార్గదర్శకుడవుతాడు చూస్తుండు ముఖ్యంగా నువ్వు ధైర్యంగా ఉండాలి అంతే!"

అంతలోనే బాధగా అరిచింది ఆమె "అమ్మా

అబ్బా చాలా నొప్పిగా వుంది సిస్టర్ కొంచెం డాక్టర్ని పిలుస్తారా? ప్లీజ్

బయపడకమ్మా నీకిప్పుడప్పుడే కాన్పు కాదు ఇంకా టైముంది కాసేపు నిద్ర పోవడానికి ప్రయత్నించు అని చెప్పి తన సీటుకేసి వెళ్ళిపోయింది ప్రమీల

* * * * *

ఏమంటున్నాడు నీ సుపుత్రుడు? వార్డులో అటూ ఇటూ తిరుగుతూ తన పని చేసుకుంటూనే చివరి బెడ్ పేషెంట్ నడిగింది ప్రమీల

'సిస్టర్ని చూడాలి అంటున్నాడు నవ్వుతూ చెప్పింది ఆమె

అలాగేం? నన్ను మాత్రమేం కర్మ మొత్తం ప్రపంచాన్నే చూడాలంటాడేమో కనుక్కో! అని తనూ నవ్వింది ప్రమీల

చేతిలో పని పూర్తి కాగానే చివరి బెడ్ వద్దకు వచ్చి నిలబడింది

మీరు చేసిన సహాయాన్ని నేను ఈ జన్మలో మరువలేను సిస్టర్ ఆత్మహత్య నుంచి నన్ను రక్షించి ఇక్కడికి తీసుకొచ్చి ఇన్నాళ్ళూ నాకు సపర్యలు చేసి ఈ ముద్దులబిడ్డను నాకందించారు మీరు నాపై అంత శ్రద్ధ చూపి నాకోసం అంత శ్రమపడి నన్ను ఆదుకోకపోతే నేను ఏమైపోయేదాన్నో ?

ఈ మాటలు అంటుంటె ప్రమీల పట్ల కృతజ్ఞతతో ఆమె గొంతు ఆర్ద్రమైంది

అబ్బె ఇందులో నేను ప్రత్యేకంగా చేసిందేముందని? ఒక మనిషి చనిపోతుంటె మానవత్వం ఉన్నవారెవరూ చూస్తూ ఊరుకోరు నేనూ అదే చేశాను ఇక ఇక్కడ నర్సుగా నాడ్యూటీ చేశాను అంతే!

అలా అనకండి సిస్టర్ మొదటి నుంచీ నాపట్ల మీరు ఓ ప్రత్యేకమైన అబిమానం చూపుతున్నట్లు నాకు అనిపిస్తోంది అయితే నామీద మీకెందుకింత ప్రేమో నాకర్థం కావడంలేదు అంటూ ఆమె చెమ్మగిల్లిన తన కళ్లను కొంగుతో తుడుచుకుంది

అలాంటిదేం లేదమ్మా నా అన్నవాళ్లెవరూ లేని ఒంటరిదానివని తెలిసినప్పటి నుంచి నా మనసు నీ పట్ల ఆకర్షితమైంది ఎందుకంటే నేనూ నీలాగే ఒంటరిదాన్ని పోన్లే అవన్నీ ఇప్పుడెందుకు గానీ నువ్వు పడుకుని రెస్ట్ తీసుకో! అని వెళ్లబోతున్న ప్రమీల ఆమె ఏడుస్తూ వుండడం చూసి మళ్లీ ఆగిపోయింది

చ! పచ్చిబాలింతలు ఇలా ఏడవ కూడదమ్మా ! ఏడిస్తే తల నొప్పి వస్తుంది ఒక్కోసారి జ్వరం కూడా రావచ్చు అంటూ వారించింది

ఆమె కళ్ళు తుడుచుకుని ఎవరైనా ఇలా ఆప్యాయంగా మాట్లాడినప్పుడల్లా ఏవేవో పాత జ్ఞాపకాలు వచ్చేస్తాయి సిస్టర్ అంది

ప్రమీల వాచీ చూసుకుని అరె చాలా టైమయిపోయిందే ? ఇక నేవెళ్తానమ్మా నువ్వు పడుకుని నిద్రపో! అనేసి అక్కణ్నుంచి వెళ్ళిపోయింది

* * * *

అబ్బ! ఈమందు చాలా చేదుగా వుంది నాజీవితం లాగే! అంది ఆమె రాని నవ్వును పెదాల మీదికి



తెచ్చుకుంటూ

తీయమంచు అదే మధురమైన జీవితం కావాలంటే మాత్రం అందరికి లభిస్తుందా? అని తనూ నవ్వింది ప్రమీల

ఈరోజేమిటో వింతగా మాట్లాడుతున్నారు సిస్టర్ మీరు?

ఇందులో వింతేముంది? నువ్వు ఏ ఉద్దేశంతో అన్నావో నేనూ అదే ఉద్దేశంతోనే అన్నాను అంతే! అని కాసేపు ఆగింది ప్రమీల ఏదో ఆలోచిస్తున్నట్లుగా వయసు పొంగులో మనం వేసే తప్పటడుగుల పరిణామం మనకు అప్పుడు తెలియదు అంది

ఆమె సిగ్గుతో తల వంచుకుంది

నిజమే సిస్టర్ అప్పుడు నాకది తప్పుగా తోచలేదు దాని ఫలితం ఇప్పుడు అనుభవిస్తున్నాను అది సరేగాని సిస్టర్ గర్భంలో ఉన్నన్ని రోజులూ నేను అమితంగా ద్వేషించిన ఈబిడ్డపై ఇప్పుడు ఉన్నట్టుండి ఇంతటి ప్రేమ వాత్సల్యం పొంగుకొస్తున్నాయేమిటా అని నాకే ఆశ్చర్యంగా ఉంది అంటూ ఒళ్లో వున్న పసిబిడ్డను ప్రేమతో గుండెల కదుముకుంది

ప్రమీల నవ్వి ఆబిడ్డ లేతబుగ్గపై తట్టింది చూశావా అక్కడే వుంది జీవిత పరమార్థం బిడ్డ మొహం చూడగానే మాతృహృదయం ఉప్పొంగి మమతానురాగాల వర్షాన్ని కురిపిస్తుంది ఆ బిడ్డ ఏ పరిస్థితులో ఎవరి వల్లనైనా పుట్టనీ, చూడటానికెలాగైనా ఉండనీ తల్లికి తన బిడ్డ అంటే ప్రేమ సహజంగా ఉండనే వుంటుంది బిడ్డను తన ప్రాణం కంటే ఎక్కువగా ప్రేమించడం ప్రతి తల్లికి సహజం ఒకరకమైన తన్మయత్వంతో చెప్పుకుపోయింది ప్రమీల

ఆ మాటలు వింటుంటే ఆమె హృదయం ద్రవించింది తన మనసులోని బాధను ప్రమీలతో చెప్పుకోవాలనిపించింది

సిస్టర్ నేను ఈ ఆస్పత్రిలో చేరినప్పటి నుంచి మీకు నా గాథను వినిపించాలని ఎంతో ఆరాటంగా ఉంది మీరు చెప్పమంటే చెబుతాను

మనసులోని బాధ ఒకరితో చెప్పుకుంటే తగ్గుతుందంటారు నీకంతగా చెప్పాలనిపిస్తే నిరభ్యంతరంగా చెప్పొచ్చు

ఆమె చెప్పనారంభించింది -

నేనూ రాజేంద్ర అనే అబ్బాయి ఒకే కాలేజిలో చదువుతూ వుండేవాళ్లం ఎవరివంకా అసలు కన్నెత్తయినా చూడని నేను రాజేంద్ర వలలో ఎలా పడ్డానో నాకే తెలియదు బహుశా అతని తీయని మాటలకు నా మనసు మోసపోయింది కాబోలు శరీరాలు వేరైనా మన మనసులు ఒకటే అన్నాడు కులం మతం, కట్టుబాట్లు సంప్రదాయాలు అన్నీ ఒట్టి బూటకాలన్నాడు ఎవరేమన్నాసరే నిన్ను పెళ్లాడితీరుతాను అని మాటిచ్చాడు అదంతా నిజమేనని నమ్మి నేను అతనితో స్వేచ్ఛగా

దేవత

నిస్సంకోచంగా తిరిగాను కన్నెపిల్లలకు ఉండవలసిన హద్దుల్ని కూడా దాటి ముందుకు వెళ్లిపోయాను చివరికి అతని కనుసైగలతో మెలిగే బొమ్మగా మారిపోయాను కాని అదంతా మోసం వంచన అని తెలుసుకునేటప్పటికే రాజేంద్ర అయిపు లేకుండాపోయాడు అతని కోసం పరితపిస్తూ నేను నా చదువును నాశనం చేసుకున్నాను

సరిగ్గా అదే సమయానికి మా అన్నయ్య ఫ్రెండుకి నన్నిచ్చి పెళ్లి చేయాలని ఆలోచిస్తున్నారు మావాళ్లు ఈలోగా నా కడుపులో మా ప్రేమఫలం రూపం దాలుస్తోందని గ్రహించాను ఇప్పుడేం చేయాలి? అన్న ప్రశ్నతో బాటు తెలీని భయం కూడా ఆవరించి రాత్రింబవళ్లు అదే బెంగయిపోయింది ఏమీ ఎరగనట్టు ఆ పెళ్లికి ఒప్పుకుని వుంటే నేను చేసిన తప్పు కప్పబడిపోయేది నాక్కూ, నా బిడ్డకూ సమాజంలో ఒక స్థానం, గౌరవం లభించేవి కానీ ఒకరివల్ల మోసపోయిన నేను మరొకర్ని మోసం చేయడానికి నా మనసు ఒప్పలేదు అందుకని బాగా ఆలోచించి ఒక నిర్ణయానికి వచ్చాను ఎవరినీ ఇబ్బంది పెట్టకుండా ఎవరిని బాధించకుండా ఇల్లొదిలి వచ్చేశాను ఏదైనా ఓ ఉద్యోగం చూసుకుని నా పొట్ట నేను పోషించుకోగలనన్న ఆత్మవిశ్వాసం నాలో బలంగా వుండేది చదువు సంస్కారం, తెలివితేటలు వున్న నాలాంటి అమ్మాయి బతకడానికి ఎన్నో మార్గాలున్నాయిలే అన్న ధీమాతో ఉద్యోగం వేట ఆరంభించాను కాని ఉద్యోగం దొరకడం నేను అనుకున్నంత సులభం కాదని కొద్దికాలంలోనే తెలిసిపోయింది అయినా ప్రయత్నాలు మటుకు మానలేదు రోజులు గడిచిపోతున్నాయి తప్ప నాకెక్కడా ఉద్యోగం దొరకలేదు ఓ చిన్నగది అద్దెకు తీసుకుని అందులో ఉండేదాన్ని వెంట తెచ్చుకున్న డబ్బు ఎప్పుడో అయిపోయింది ఒంటి మీదున్న నగలు కూడా అప్పుడొకటి, అప్పుడొకటిగా బజారు చేరుకున్నాయి అంతమాత్రమే అయితే నేనేం భయపడేదాన్ని కాదు కాని రోజురోజుకి ముందుకు వస్తున్న నాపొట్ట అందరి దృష్టిని ఆకర్షించసాగింది మెడలో మంగళసూత్రం లేకుండా గర్భవతి అయిన నన్ను చూసి ఇరుగు పొరుగు అమ్మలక్కలు గుసగుసలాడుకునేవారు వాళ్ల చూపుల్లో తిరస్కారభావం నిండి వుండేది కొందరైతే నాకు వినిపించేటట్టే చాలా అవమానకరంగా మాట్లాడేవాళ్లు నా పరిస్థితి చూసి జాలి, సానుభూతి చూపేవాళ్లు ఒక్కరూ కనిపించకపోవడంతో నాలో నేనే కుమిలికుమిలి ఏడుస్తూ గదిలోనే ఉండిపోయేదాన్ని అలాఅలా తొమ్మిది నెలలూ గడిచిపోయాయి అంతవరకూ అందరి అవమానాలు తిరస్కారాలు భరిస్తూ వచ్చిన నాకు ఇక భరించే ఓపిక లేకపోయింది ఈ బాధల నుండి తప్పించుకునే మార్గం ఇక ఒక్కటే మిగిలింది నాకు అదే ఆత్మహత్య వెంటనే మోతాదును మించి నిద్ర మాత్రలు మింగేశాను ఆ తరువాత జరిగిందంతా మీకు తెలిసిందే!

అంతలో ప్రమీల అందుకుని నేనారోజు డ్యూటీ నుంచి ఇంటికి వెళుతూ నీ గది ముందు చాలామంది జనం గుమిగూడి వుండడం చూశాను దగ్గరికి వచ్చి ఎవర్నో కనుక్కుంటే సంగతి తెలిసింది వెంటనే జనం మధ్య నుంచి దారి చేసుకుని లోపలికి వచ్చాను నీ పక్కన నిద్రమాత్రల ఖాళీ సీసా కనిపించగానే గాబరాతో నీ నాడి పట్టుకు చూశాను నీకింకా ప్రాణం పోలేదని పసిగట్టగానే అక్కడున్నవాళ్ల సాయంతో నిన్నిక్కడికి తీసుకొచ్చి నిన్ను బతికించడానికి ప్రయత్నాలు మొదలెట్టాం ఎలాగైతేనేం మా ప్రయత్నాలు ఫలించాయి నువ్వు బతికి బయటపడ్డావు అదృష్టంకొద్దీ నీ కడుపులో ఉన్న పసిబిడ్డకు ఏమీ ఎఫెక్ట్ కాలేదు అందుకు సంతోషించాలి మనం అంది

మళ్లీ ఏదో గుర్తొచ్చినట్టు అంది ప్రమీల నువ్వు నాకో మాటివ్వాలి అని

నేనా ? ఆశ్చర్యంగా చూసింది ఆమె

అవును నువ్వే ఇంకెప్పుడూ ఆత్మహత్య మాట తలపెట్టనని మాటివ్వు

ఆమె ఏం మాట్లాడలేదు ఏదో ఆలోచిస్తూ మౌనంగా కూర్చుండిపోయింది

ఆ మాటివ్వడానికి ఇంత ఆలోచన ఎందుకు? నువ్వు పోతే ఈ బిడ్డ గతేమవుతుందో ఆలోచించావా?

దిక్కులేని అనాధ అనిపించుకుంటాడు అంతేగా? విరక్తిగా అంది ఆమె

నీ కడుపున పుట్టిన బిడ్డను పెంచి పెద్ద చేసి మంచిమనిషిగా తీర్చిదిద్దవలసిన బాధ్యత నీపై వుంది అంతేగాని వాణ్ని అనాథగా మిగిల్చే హక్కు నీకులేదు

ఎంతో కాలంనుంచి కలిసివున్న స్నేహితురాళ్లల్లా మనసు విప్పి మాట్లాడుకుంటున్న వాళ్లిద్దరిలో ఎవరూ డాక్టరు రావడం గమనించలేదు

సిస్టర్ అంటూ దగ్గరికి వచ్చిన లేడీ డాక్టరు ఓ ఏదో ఎరియస్‌గా మాట్లాడుకుంటున్నట్టుందే ?" అనగానే ప్రమీల చటుక్కున లేచి నిలబడింది

లేడీ డాక్టరు పేషెంటు వైపు తిరిగి ఎలా ఉన్నావమ్మా? అని అడిగింది

బాగానే వున్నాను డాక్టర్ అంది ఆమె

* * * *

ఆ రోజు ఉదయం డ్యూటీకి రాగానే ప్రమీల ముందు చివరి బెడ్ పేషెంట్ దగ్గరికి వచ్చి ఈ రోజు నిన్ను డిశ్చార్జ్ చేస్తారమ్మా అని చెప్పింది

పిడుగు పడ్డట్టయింది ఆమెకు

"ఏమిటీ....ఏమన్నారు?" అంది తడబడుతూ.

ఆమె కంగారు భయం చూసి ప్రమీలకు నవ్వొచ్చింది.

"ఈ రోజు నిన్ను డిశ్చార్జ్ చేస్తారమ్మా అన్నాను అంతె. దానికంత కంగారెందుకు?"

ఆమె మొహం పాలిపోయింది. కళ్ళల్లో భయం చోటుచేసుకుంది.

"ఈ రోజే వెళ్ళిపోవాలా సిస్టర్?" అని దీనంగా అడిగింది.

"ఇక్కడి రూల్స్ ప్రకారం డిశ్చార్జ్ అయినరోజే ఇంటికీ వెళ్ళిపోవాలి. తల్లీ బిడ్డల ఆరోగ్యం బాగుంటేనే డాక్టర్‌గారు డిశ్చార్జ్ చేసేది!" అని ప్రమీల వివరించింది.

ఆమెకు అప్పటికే ఏడుపు ముంచుకు వచ్చేస్తోంది. ఎలాగో అతికష్టంగా మాటలు కూడదీసుకుని అంది. "ఆ మాట నిజమే సిస్టర్.... కానీ ఇప్పుడు నేను ఎక్కడికి వెళ్ళాలి అని?"

ప్రమీల ఆమెవైపు జాలిగా చూస్తూ "వెళ్ళాలికదమ్మా.... ఎల్లకాలం ఇక్కడే ఉంచరుగా?" ఇది ఆసుపత్రి. నీకు తెలయందేముంది?"

"ఇప్పుడే వెళ్ళిపోవాలా స్టర్? నాకు కొంచెం ఆలోచించడానికి కూడా టైమ్ ఇవ్వరా? ఇన్నాళ్ళూ నాకో చిన్నగదైనా ఉండేది. ఈ పాటికి ఇంటాయన ఆ గదిని స్వాధీనం చేసుకునే వుంటాడు. నేను రెండు నెలల అద్దె బాకీ వున్నాను. అలాంటప్పుడు ఏ మొహం పెట్టుకుని వెళ్ళేది!" అని వెక్కి వెక్కి ఏడవసాగింది ఆమె. రెండు చేతుల్లోనూ మొహం దాచుకుని దీనంగా విలపిస్తున్న ఆమెను ఇక చూడలేకపోయింది ప్రమీల. తన కళ్ళల్లో కూడా నీరు తిరుగుతుండగా ఆమె మొహాన్ని పైకెత్తి కళ్ళనీళ్ళు తుడిచింది. ఆ తరువాత వీపుమీద ఆప్యాయంగా నిమురుతూ "ఏడవకమ్మా....ఇప్పుడే వెళ్ళక్కరలేదు. డాక్టర్ వచ్చి డిశ్చార్జ్ చేస్తారు. అంతవరకూ టైమ్ ఉంది." అంది.

ఆమె ఏడుస్తూనే "ఈ పసిబిడ్డ నెత్తుకుని నేను ఎక్కడి కెళ్ళాలి. సిస్టర్?" అంది.

ప్రమీల ఆమె మొహాన్ని పైకెత్తి "మా ఇంటికి" అంది.

ఆమె ప్రమీల వైపు ఆశ్చర్యంగా చూసింది. ఆమె కళ్ళు 'ఇది నిజమా?' అని ప్రశ్నిస్తున్నట్టుగా వున్నాయి.

ప్రమీల నవ్వుతూ "ఏమిటలా ఆశ్చర్యంగా చూస్తున్నావ్? నిజంగానే చెబుతున్నాను.మీ ఇద్దర్ని పోషించడం నాకు పెద్ద బరువుకాదు. బాబు పెద్దవాడైదాకా ఉండి ఆ తరువాత ఏదైనా ట్రైనింగ్ చేసుకుని ఉద్యోగం సంపాదించవచ్చు. నీకాళ్ళమీద నువ్వు నిలబడే దాకా నువ్వు మా ఇంట్లో వుండు" అంది

"మరి మమ్మల్ని మీ ఇంటికి తీసుకెళితే మీ ఇంట్లోవాళ్ళు ఊరుకుంటారా?" అంది ఆమె అనుమానంగా.

ప్రమీల తేలిగ్గా నవ్వి "మా ఇంట్లో నాకు అడ్డు

ఇంధన కణాలు!

ధర్మల్ శక్తి, హైడ్రాలిక్ శక్తి, అణుశక్తి తరువాత నాలుగవదైన ఇంధన కణాలను పెంపొందించడానికి జపాన్‌లో పోటీ అంతకంతకూ ఉధృత రూపం దాల్చుతోంది. ఈ పోవటంలో ప్రధాన విద్యుచ్ఛక్తి సంస్థ, నగం గ్యాస్ సంస్థలూ, విద్యుచ్ఛక్తి స్టోరేజి బ్యాటరీలను తయారు చేసే సంస్థ పాల్గొంటున్నాయి.

రసాయనిక శక్తిని సరాసరి మార్పు చేసే ఇంధన కణాలు ఇంధనంగా, విద్యుచ్ఛక్తితో విద్యుత్ రసాయన ప్రతిక్రియ ద్వారా వినియోగించబడతాయి. బొగ్గు, పెట్రోలియంని మండించడం వలన 40 శాతం ఉష్ణ శక్తి ఉత్పత్తికాగా దీనివల్ల 80 శాతం ఉత్పత్తి అవుతుంది.

(జ. వా)

దేవత

చెప్పేవాళ్ళు ఎవరున్నారని? ఇంట్లో వుండేదే ఇద్దరం నేనూ, మా పాప ఉష." అంది.

"మరి మీ వారు....?" అంటూ సందేహంగా ఆగిపోయింది ఆమె.

ప్రమీల పెదాల మీది నవ్వు వెంటనే మాయమైంది. ముఖం గంభీరంగా మారిపోయింది.

"హు.... మా వారు!" అంటూ పళ్ళు పటపటా కొరికి "అసలు పెళ్ళంటూ అయితేగా నాకు మా వారంటూ ఉండడానికి?"

ఆమెకు ప్రమీల మాటలు అర్థంకాలేదు. తెల్లబోయి చూసింది ప్రమీల వైపు.

"అంతలా తెల్లబోయి చూస్తావే?" నాదీ నీలాంటి కేసేనమ్మా! అందుకే నాకు నీమీద జాలీ, సానుభూతి. కానీ నీలా పిరికితనంతో నేను ఆత్మహత్యకు పాల్పడలేదు. ధైర్యంతో ఈ సమాజాన్ని ఎదిరించి నిలబడగలిగాను. ఈరోజు నన్ను అందరూ గౌరవిస్తారు. ఒకప్పుడు నన్ను హేళన చేసినవారే ఈ రోజు నన్ను దేవతగా చూస్తున్నారు. కారణం – ఈ ఆస్పత్రిలో నర్సుగా ఉండటం. అందుకే ఈ ప్రపంచంలో ఎవరికీ భయపడకూడదు; దేనికీ భయపడకూడదు. ఎలాంటి కష్టాలకీ కుంగిపోకూడదు, ఎలాంటి అవమానాలకీ తిరస్కారాలకీ జడవకూడదు. అందరినీ ఎదిరించి ధైర్యంతో ముందడుగు వేస్తే మనం సాధించలేనిది ఏదీ ఉండదు." అని ప్రమీల ఇంకా చెబుతూవుంటే ఆమె అడ్డుతగిలి "అసలు దీనికంతా కారణం ఎవరు సిస్టర్?" అని అడిగింది.

"ప్రభాకర్ అనే ఒక మోసగాడు. అతను నన్ను నమ్మించి మోసంచేసి తీరా పెళ్ళి దగ్గరకొచ్చేసరికి పరారయ్యాడు. నేనూ నీలాగే అతని మాయమాటలు నమ్మి మోసపోయాను. ఇది నేను చేసిన పెద్ద పొరపాటు. ముందే పెళ్ళి చేసుకుని ఆ తరువాత ఇద్దరూ చేరువవుదామని గట్టిగా పట్టుపట్టి వుంటే అతని అసలు రంగు బయటపడేదేమోగానీ నాకప్పుడు అతని వ్యామోహంలో ఏదీ తెలిసిరాలేదు. ఎప్పుడైతే నేను నెల తప్పానో అప్పట్నుంచీ అతను అయిపులేకుండా పోయాడు. కన్నెగా ఉంటూ గర్భవతి అయిన నన్ను చూసి సమాజం హేళన చేసినా నేను ఖాతరు చేయలేదు. ధైర్యంగా సమాజాన్ని ఎదిరించి నా చిన్నారి పాపకు జన్మనిచ్చాను....ఇప్పుడు దాన్ని పెంచి పెద్దచేసి డాక్టర్ చేయాలన్న ఉద్దేశంతో బతుకుతున్నాను. నేనే గనక నర్సు ట్రైనింగ్ చేయకపోయినట్లయితే ఎలాంటి ఇబ్బందుల్ని ఎదుర్కోవాల్సి వచ్చేదో నిన్నిప్పుడు చూస్తునే తెలుస్తోంది. ఇప్పటి నీ పరిస్థితే అప్పుడు నాకూ ఎదురయ్యేది. కానీ నేను జాగ్రత్తపడి నర్సు ట్రైనింగ్ చేయడంవల్ల నాకు ఈ ఆస్పత్రిలో నర్సు ఉద్యోగం దొరికింది. ఒకప్పుడు నన్ను నిందించినవాళ్ళే ఇప్పుడు నన్ను గౌరవిస్తున్నారు, చేతులెత్తి నమస్కరిస్తున్నారు. తమ బిడ్డల్ని ఇళ్ళకు తీసుకెళ్ళేటప్పుడు తమ కృతజ్ఞతలు తెలియజేసుకుంటున్నారు. ఆస్పత్రిలో ఉన్నవాళ్ళు నా సేవలు అందుకున్నందుకు కానుకలు అర్పిస్తున్నారు. అందుకే చెబుతున్నానమ్మా.... నువ్వు నాలానే ఏదైనా ట్రైనింగ్‌లో చేరు ఉద్యోగం తప్పకుండా దొరుకుతుంది. బాబును చూసుకుంటూ జీవితం గడిపేయ్. జరిగింది మరిచిపో!"

ఆమె కళ్ళూ, నోరూ వెళ్ళబెట్టి ప్రమీల వైపు అలా చూస్తూ వుండిపోయింది. కానీ ఆమె ధైర్యానికి మనసులోనే జోహార్లర్పించకుండా ఉండ లేకపోయింది.

మళ్ళీ ప్రమీలే చెప్పసాగింది.

"నేను చాలా కాలంగా ఈ నర్సు ఉద్యోగం చేస్తున్నాను. నా సర్వీసులో ఎంతోమంది పేషెంట్లను చూశాను. అయితే ఇలాఎవరితోనూ చనువుగా మాట్లాడి నా స్వంత విషయాలు చెప్పుకోలేదు. వాళ్ళ కష్టసుఖాలూ కనుక్కోలేదు. నా డ్యూటీ ప్రకారం వాళ్ళకు సేవలు చేశానుగానీ మనస్ఫూర్తిగా ఎవరికీ ఏమీ చేయలేదు. అటువంటప్పుడు నువ్వుమాత్రం నన్నెలా ఆకట్టుకోగలిగావో నాకిప్పటికీ అర్థంకాదు. బహుశా నాదీ, నీదీ ఒకేకేసు కావడం దీనికి కారణం కావచ్చు.

ప్రమీల ఇంకా ఎంత సేపలా మాట్లాడుతూ ఉండేదోగానీ అంతలో ఎవరో ఆమెను పిలవడంతో చప్పున వాస్తవంలోకి వచ్చింది. పిలుపు వినిపించిన వైపు వెళుతూ ప్రమీల" ఆఁ...మన ఈ చరిత్ర కేమిటిగానీ.... నేను డ్యూటీ పూర్తి చేసుకుని తిరిగొచ్చే సరికి నువ్వు రెడీగా ఉండు డాక్టరుగారితో చెప్పేసి ఇంటికి వెళ్ళిపోదాం." అని చెప్పి వెళ్ళిపోయింది.

మనసంతా కృతజ్ఞత నిండిపోగా ప్రమీల వెళ్ళినవైపే చూస్తూ కూర్చుండిపోయింది ఆమె. □